క్లుప్తంగా

గంగమ్మ జాతరకు చాటింపు


విశేషాలంకరణలో గంగమ్మ

రేణిగుంట: పట్టణంలో గంగమ్మ జాతరకు చాటింపు ఉత్సవం మంగళవారం రాత్రి వేడుకగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ సోలా మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో తొలుత కమిటీ సభ్యులు, భక్తులు అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పురవీధుల్లో జాతర చాటింపు వేశారు. ఈనెల 12, 13, 14వ తేదీల్లో గంగజాతర వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మాజీ సర్పంచ్ జ్యోతినారాయణ, సభ్యులు సదాశివరెడ్డి, రావణన్, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై కృష్ణ భగవానుడు

నారాయణవనం: మండలకేంద్రంలోని ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం కృష్ణ భగవానుడు అశ్వవాహనంపై పురవీధుల్లో విహరించారు. భక్తులు కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అశ్వవాహనంపై శ్రీకృష్ణుడు, ఆలయం నుంచి ద్రౌపదీ, పాండవులు వేర్వేరుగా నగరు వీధికి చేరుకున్నారు. అక్కడ ద్రౌపదీ, పాండవుల స్వయంవరం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లు ఆలయానికి చేరుకున్నారు. రాత్రి ద్రౌపదీదేవి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

చిందేపల్లెలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు


రోగుల వివరాలు సేకరిస్తున్న టాటా ట్రస్టు వైద్య సిబ్బంది

ఏర్పేడు: మండలంలోని చిందేపల్లెలో మంగళవారం రాష్ట్రీయ సేవా సమితి(రాస్), తిరుపతి టాటా ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరిగాయి. చిందేపల్లె, ఎస్సీ, ఎస్టీ కాలనీల నుంచి వచ్చిన 120 మంది రోగులకు బీపీ, షుగర్, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో టాటా ట్రస్టు డాక్టర్ వెంకయ్య బాబు, హేమంత్‌కుమార్, రెడ్డికుమారి, మెహర్‌తాజ్, మహేంద్ర, రాస్ సిబ్బంది వినోద్, జయలలిత, రాజశేఖర్ పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరించండి


మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని భూసమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని వీఆర్వోలను నూతన తహసీల్దార్ ఐ.సుబ్రమణ్యం ఆదేశించారు. ఆయన మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, సర్టిఫికెట్లను సకాలంలో అందజేయాలన్నారు. కార్యాలయం చుట్టు పనుల కోసం ప్రజలు తిరగకుండా చూడాలని, గ్రామాల్లో అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ చంద్రబాబునాయుడు, సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు మద్యం స్వాధీనం

సత్యవేడు: మండలంలోని రామచంద్రాపురంలో నిర్వహిస్తున్న బెల్టుషాపుపై ఎక్సైజ్ అధికారులు దాడి చేసి తమిళనాడు మద్యం 15 క్వార్టర్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. షాపు నిర్వాహకుడు మస్తాన్‌ను అదుపులోకి తీసుకొన్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

ముక్కంటి సేవలో తణుకు ఎమ్మెల్యే


ఆలయ ధ్వజస్తంభం వద్ద తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని మంగళవారం తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

భారీ వర్షం



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో మంగళవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. రెండు వారాలుగా ఎండ వేడిమితో ఇబ్బంది పడుతున్న ప్రజలకు భారీ వర్షంతో ఉపశమనం కలిగింది. వరి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

స్కూలు కమిటీలు.. అభివృద్ధికి పునాదులు

- పాఠశాలల్లో ఎన్నికల సందడి
- 8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు
- విద్యా కమిటీలో సభ్యులకు రెండేళ్ల పదవీ కాలం
- నియోజకవర్గంలోని 394 స్కూళ్లలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు



మండలం	పాఠశాలల సంఖ్య
నాగలాపురం	40
పిచ్చాటూరు	39
సత్యవేడు	64
నారాయణవనం	48
వరదయ్యపాళెం	69
బీఎన్‌కండ్రిగ	60
కేవీబీపురం	74

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు పాఠశాలల అభివృద్ధికి దోహదం చేస్తాయి. విద్యార్థుల తల్లిదండ్రుల్లో కొందరు కమిటీ పాలకవర్గం కావడంతో స్కూళ్లలో మౌలిక వసతుల కల్పన, పాఠశాలల నిధుల వినియోగం, మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలన, పాఠశాల పరిశుభ్రత తదితర అంశాల్లో పాలుపంచుకుని అభివృద్ధికి పునాదులు వేస్తారు. ఈ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడింది. ఈ ఎన్నికల విధివిధానాలపై కథనం.


కొత్త హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల సమీక్షలో పాల్గొన్న ఎంఈఓ సరస్వతి

వరదయ్యపాళెం: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికల సందడి మొదలైంది. స్కూల్ కమిటీల పేరుతో ప్రభుత్వం సూచన మేరకు జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆ మేరకు ఓటర్ల జాబితాను విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. ఈ నెల 8వ తేదీన సత్యవేడు నియోజకవర్గంలోని 394 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి.

ఎన్నికల నిర్వహణ ఇలా..

పాఠశాలలో సెక్షన్‌లు, మీడియంతో సంబంధం లేకుండా తరగతి యూనిట్‌గా ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలి. వీరిలో కనీసం ఇద్దరు మహిళలు, ముగ్గురిలో ఒక్కరు తప్పకుండా ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతులు, మరొకరు బీసీ, ఈబీసీ, మైనారిటీకి చెందిన వ్యక్తి అయి ఉండాలి. తరగతి నుంచి సభ్యుల ఎన్నికకు 50శాతం ఓటర్లు రిజిస్టర్‌లో చూపిన తర్వాతనే ఎన్నిక జరపాలి. అలాగే చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కూడా 50 శాతం సభ్యులు హాజరు ఉండాలి. క్లాసుల వారీగా ఎన్నికైన సభ్యులందరూ స్కూల్ మేనేజ్‌మెంట్ సభ్యులుగా ఉంటారు. వారంతా కలసి కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. అలాగే తరగతిలో కనీసం ఆరుగురు విద్యార్థులు లేకపోతే మరో తరగతిలోకి విలీనం చేసి ఎన్నుకోవాలి.

ఒకరికే ఓటు వేసే హక్కు

విద్యార్థి తల్లిదండ్రుల్లో ఒకరు మాత్రమే ఓటు వేయడానికి అర్హులు. వివిధ తరగతుల్లో పిల్లలు ఉంటే ఆయా తల్లిదండ్రులు తరగతి ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడానికి అర్హులే. ఎస్‌ఎంసీలో ఎన్నికైన సభ్యుల నుంచి చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకోవాలి. ఎలాంటి రాజకీయ జోక్యం ఉండకూడదు. ఈ ఎన్నికల ప్రక్రియలో అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

చేతులెత్తే విధానం

ఈ ఎన్నికలు సాధారణంగా చేతులను ఎత్తడం ద్వారా లేదా నోటితో చెప్పడం ద్వారా నిర్వహిస్తారు. అపరిష్కృత వివాదాలు, అసాధారణ పరిస్థితుల్లో రహస్య బ్యాలెట్ విధానాన్ని అవలంబిస్తారు.

పరిశీలకులు వీరే..

స్కూల్ కమిటీ ఎన్నికల్లో ప్రధానోపాధ్యాయులు, ఎన్నికల అధికారిగా ఉంటారు. తహసీల్దార్, ఎంపీడీఓ, వీఆర్వోలు ఎన్నికల పరిశీలకులుగా ఉంటారు. తల్లి, తండ్రి, పిల్లలు సంరక్షకులుగా ఉన్నవారు ఓటర్లుగా ఉంటారు. ఈ నెల 5వ తేదీన తుది జాబితాపై అభ్యంతరాలు పూర్తయ్యాయి. 8వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోపు సభ్యులతో పాటు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు కమిటీ తొలి సమావేశం నిర్వహించాలి. పాఠశాల విద్యా కమిటీలో ప్రతి సభ్యుడికి రెండేళ్ల పదవీకాలం ఉంటుంది.


పాండూరు హైస్కూల్‌లో నోటీసును అంటిస్తున్న ఎంఈఓ సరస్వతి, హెచ్‌ఎం విమలకుమారి

గత ప్రభుత్వంలో స్కూల్ కమిటీలకు పెద్దపీట

గత ప్రభుత్వంలో స్కూల్ కమిటీ సభ్యులకు అధిక ప్రాధాన్యతనిస్తూ నాడు–నేడు పనులు కమిటీ సభ్యులకే అప్పగించారు. దీంతో నాడు–నేడు పనులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగాయి. ప్రతి నెలా సమావేశం నిర్వహించి విద్యార్థుల పురోగతి, పాఠశాల అభివృద్ధి పనులపై సమీక్ష చేసి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకునేవారు. ఈ ఏడాది ప్రభుత్వం మారడంతో కూటమి పార్టీ నాయకులు పాఠశాల ఎన్నికలపై దృష్టి సారించారు.

పకడ్బందీగా నిర్వహణ



మండలవ్యాప్తంగా 69 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 8న పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే ఆయా గ్రామాల పాఠశాల నోటీస్ బోర్డులో ఓటరు జాబితా ప్రదర్శించాం. ఓటరు జాబితాపై అభ్యంతరాలు కూడా స్వీకరిస్తున్నాం. అయా గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో నిబంధనల మేరకు పారదర్శకంగా ఎవరి ప్రమేయం లేకుండా స్కూల్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తాం.
– సరస్వతి, ఎంఈఓ, వరదయ్యపాళెం మండలం

కాలువ పూడికతీత పనులు ప్రారంభం


కాలువ పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

శ్రీకాళహస్తి: రానున్న వర్షాకాలం నేపథ్యంలో శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణంలోని జయరామరావువీధిలో కాలువ పూడికతీత పనులను ప్రారంభించారు. పట్టణ పరిధిలోని వడ్డేరు, ఓటేరు, కన్నలి, నాగులగుంట కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ప్రజలు కూడా కాలువల్లో చెత్త వేయకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు లలిత, శైలజ, శ్రీకాంత్, దినకర్, సచివాలయ సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కారు పార్కింగ్ టెండర్ రద్దు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన కారు పార్కింగ్ టెండర్ రద్దు అయింది. ఇటీవల జరిగిన టెండర్లలో కేవలం ఇద్దరు మాత్రమే పాల్గొన్నారు. రూ.95 లక్షలకు టెండర్‌ను దక్కించుకోవడానికి ప్రయత్నించారు. అయితే తక్కువ ధరకు టెండర్ రావడంతో దేవదాయశాఖ అధికారులు టెండర్‌ను రద్దు చేశారు. గత ఏడాది నవంబర్ నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయ సిబ్బంది కారు పార్కింగ్ వసూలు చేస్తున్నారు. నెలకు సరాసరి రూ.20 లక్షలు ఆదాయం వస్తోంది. అయితే పార్కింగ్ రుసుం వసూలులో కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయినా నెలకు రూ.20 లక్షలు వసూలు అవుతోంది. అంటే ఏడాదికి రూ.2.40 కోట్లు ఆలయానికి ఆదాయం వస్తోంది. కొందరు నాయకులు కలిసి టెండర్‌లో పాల్గొన్నారు. కేవలం రూ.95 లక్షలతో టెండర్లు వేశారు. ధర తక్కువ కావడంతో దేవదాయశాఖ అధికారులు టెండర్‌ను రద్దు చేశారు. దీంతో ఆలయానికి రూ.కోటి ఆదాయం మిగిలింది.

ఉపాధి హామీ పనుల తనిఖీ


ఉపాధి పనులు తనిఖీ చేస్తున్న డ్వామా పీడీ

నాగలాపురం: మండలంలోని వేణుంబాక్కం పంచాయతీ రామాంజనేయ చెరువులో ఉపాధి హామీ పనులను మంగళవారం తిరుపతి జిల్లా డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన కూలీలతో మాట్లాడుతూ కూలీలకు రోజువారీ సగటు వేతనం రూ.300 ఇస్తున్నారా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రోజు కనీస వేతం వచ్చేలా మార్కింగ్ ఇచ్చి, పని చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీలో జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఉపాధి పని కల్పించి 100 రోజులు పనిని పూర్తి చేయాలని, అలాగే పంచాయతీలో ఉపాధి హామీ రికార్డులను ప్రతివారం తనిఖీ చేసి ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, ఏపీఓ సుధాకర్, జీఈ సురేష్ పాల్గొన్నారు.

మాస్టర్ ట్రైనర్స్‌గా అధ్యాపకులకు అవకాశం



సంక్రాంతి రాజేంద్రుడు, మునెయ్య

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న సంక్రాంతి రాజేంద్రుడు, మునెయ్యకు మాస్టర్ ట్రైనర్స్ అవకాశం దక్కింది. ఏపీ సీసీఈ యునెస్కో– ఎంజీఐఈపీ సంయుక్తంగా డిగ్రీ విద్యార్థులకు సోషల డెవలప్‌మెంట్ స్కిల్స్ పేపర్ 1 సర్టిఫికెట్ కోర్సుపై సీక్–సెల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను చిత్తూరులోని పీవీకేఎన్ జీడీసీలో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు తిరుపతి, చిత్తూరు జిలాలలో ఎంపికైన డిగ్రీ కళాశాల అధ్యాపకులకు ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఈ ఐదు రోజుల ట్రైనింగ్ ప్రోగ్రామ్‌కు శ్రీకాళహస్తి ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల నుంచి అధ్యాపకులు సంక్రాంతి రాజేంద్రుడు, డాక్టర్ వి.మునెయ్యకు మాస్టర్ ట్రైనర్స్‌గా అవకాశం దక్కింది. వీరిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత, అధ్యాపకులు అభినందించారు.

ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సహకరించండి


కేంద్రమంత్రికి శ్రీవారి ప్రసాదాలు అందజేస్తున్న పీసీ రాయల్

తిరుపతి కల్చరల్: తిరుపతి ఎయిర్‌పోర్టు అభివృద్ధికి సహకరించాలని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్, ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కమిటీ మెంబర్ డాక్టర్ పీసీ రాయల్ మంగళవారం కేంద్రమంత్రి మురళీధర్ మోహోల్‌ను కోరారు. మంగళవారం ఢిల్లీలో సివిల్ ఏవియేషన్ యూనియన్ మినిస్టర్ మురళీధర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శ్రీవారి ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి ఎయిర్‌పోర్టు అభివృద్ధిపై ప్రత్యేకంగా చర్చించామని తెలిపారు. తనవంతు సహాయసహకారాలు అందిస్తానని ఈ సందర్భంగా కేంద్రమంత్రి హామీ ఇచ్చారని చెప్పారు.

ముస్తాబవుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయం


ఆలయం వద్ద చలువ పందిళ్లు వేస్తున్న కూలీలు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఆలయంలో ఈ నెల 9 నుంచి 19వ తేదీ వరకు చేనేత సంఘం ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ క్రమంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయం వద్ద చలువపందిళ్లు, ఆలయంలోని వివిధ రకాల ఉత్సవ మూర్తులకు రంగులు వేయడంలాంటి తదితర పనులు నిరంతరాయంగా జరుగుతున్నాయి.

నేడు ఆండాళ్ తిరువడిపురం ఉత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీగోవింద రాజస్వామి వారి ఆలయంలో ఈనెల 7వ తేదీ బుధవారం శ్రీఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవం ఘనంగా జరుగనుంది. శ్రీఆండాళ్ అమ్మవారి శాత్తుమొర సందర్భంగా ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు శ్రీగోవిందరాజస్వామివారు, శ్రీఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీగోవిందరాజస్వామి వారు, శ్రీఆండాళ్ అమ్మవారిని అలిపిరికి ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ ఆస్థానం నిర్వహిస్తారు. ప్రత్యేక పూజల అనంతరం అలిపిరి నుంచి రామనగర్ క్వార్టర్స్ గీతామందిరం, ఆర్‌ఎస్ మాడవీధిలోని వైఖానచార్యుల వారి ఆల్యం, చిన్నజీయర్ మఠం మీదుగా ఊరేగింపుగా తిరిగి ఆలయానికి చేరుకుంటుంది. రాత్రి 8 గంటలకు శ్రీఆండాళ్ అమ్మవారి సన్నిధిలో శాత్తుమొర నిర్వహిస్తారు.

నాగనందాపురంలో డయేరియా


డయేరియాపై స్థానికులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా లెప్రసీ అధికారి శ్రీనివాసరావు

వరదయ్యపాళెం: మండలంలోని నాగనందాపురంలో పంచాయతీ నీరు కలుషితమై స్థానికులు డయేరియా వ్యాధి బారినపడ్డారు. మూడు రోజులుగా గ్రామంలోని పలువురు వాంతులు, విరేచనాలతో అవస్థ పడుతున్నారు. దీంతో సమాచారం అందుకున్న చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల బృందం గ్రామానికి చేరుకుని వైద్య సేవలు అందించే పనిలో నిమగ్నమయ్యారు. స్థానిక పంచాయతీ అధికారుల సమన్వయంతో పారిశుద్ధ్య పనులు, కలుషితమవుతున్న నీటి కట్టడికి చర్యలు చేపడుతున్నారు.

కొనసాగుతున్న వైద్యసేవలు

రెండు రోజులుగా చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ అనిత, డాక్టర్ లావణ్య, క్షేత్రస్థాయి సిబ్బంది ఆధ్వర్యంలో 24గంటలు గ్రామంలోనే ఉంటూ బాధితులకు వైద్యసేవలు అందించే చర్యలు చేపడుతున్నారు. మందులు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటివరకు 19 డయేరియా కేసులను గుర్తించినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారుల బృందం మంగళవారం సాయంత్రం నాగనందాపురం గ్రామాన్ని సందర్శించి, వైద్యం పొందుతున్న వారిని పరామర్శించి, వైద్యం అందుతున్న తీరును పరిశీలించారు. జిల్లా లెప్రసీ అధికారి శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది ఆయనతో ఉన్నారు.


నాగనందాపురంలో డయేరియా బారినపడిన వారికి వైద్యం అందిస్తున్న సిబ్బంది


నాగనందాపురంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ ద్వారా వైద్యం అందజేస్తున్న డాక్టర్ లావణ్య

గ్రంథాలయానికి మోక్షమెప్పుడో?


అద్దె భవనంలో ఉన్న గ్రంథాలయం,



ప్రారంభానికి నోచుకోని నూతన భవన గ్రంథాలయం

శ్రీకాళహస్తి: గ్రంథాలయానికి మోక్షమెప్పుడోనని, నూతన భవనం నిర్మించినా అద్దెభవనంలో గ్రంథాలయం నడపడమేమిటని పాఠకులు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలో 1961వ సంవత్సరంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. స్వర్ణముఖి నది ఒడ్డున ప్రస్తుత అన్న క్యాంటిన్ ఉన్న ప్రాంతంలో గ్రంథాలయం నడిచేది. అక్కడ ఆ భవనం నేలమట్టం కావడంతో ఆలయం సమీపంలోని అద్దె భవనంలోనికి మార్చారు. 15 సంవత్సరాలుగా అద్దె భవనంలోనే గ్రంథాలయ కార్యక్రమాలు నడుస్తున్నాయి. ప్రస్తుతం రోజువారీ 150 మంది పాఠకులు గ్రంథాలయానికి వస్తున్నారు. పుస్తకాలు అద్దెకు తీసుకునేవారు 25 మంది ఉన్నారు. ఈ గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకున్నవారు 19,200మంది ఉన్నారు. పుస్తకాలకు 2,800 డిపాజిటర్లుగా ఉన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత 20 నుంచి 40మంది రోజు వివిధ రకాల మెటీరియల్ కోసం ఇక్కడికి వచ్చిపోతున్నారు. అయితే 20 మందికి పైగా పట్టని ఆ గదిలో పఠనం చాలా ఇబ్బందిగా ఉంది. 10 మంది కిందకు వస్తే పది మంది పైకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వికలాంగులు, వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మదుసూదన్‌రెడ్డి చొరవ తీసుకుని పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ భవనం సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున స్థలం కేటాయించి రూ.60 లక్షలతో గ్రంథాలయ నూతన భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఆ పనులు పూర్తి అయ్యాయి. అయినా ఆ గ్రంథాలయం ప్రారంభానికి నోచుకోలేదు. నూతన ప్రభుత్వం ఏర్పడి 50 రోజులు గడుస్తున్నా గ్రంథాలయాన్ని నూతన భవనంలోకి మార్చకపోవడంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే స్పందించి గ్రంథాలయాన్ని నూతన భవనంలోకి మార్చాలని పాఠకులు కోరుతున్నారు.

త్వరలోనే సొంత భవనంలోకి తరలిస్తాం

గత ప్రభుత్వంలో నిర్మించిన గ్రంథాలయ భవనం ఎన్నికల కోడ్ కారణంగా ప్రారంభించకుండా ఆగిపోయింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత జిల్లా అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాం. సాధ్యమైనంత త్వరలో నూతన భవనాన్ని ప్రారంభించి, అద్దె భవనంలో నుంచి గ్రంథాలయాన్ని తరలిస్తాం.
– లావణ్య,గ్రంథాలయ అధికారి

వైభవంగా పోలేరమ్మ జాతర


బుచ్చినాయుడుకండ్రిక: జాతర చాటింపు వేస్తున్న నిర్వాహకులు


నాగలాపురం: దున్నపోతును ఊరేగిస్తున్న గ్రామస్తులు


నారాయణవనంలో జాతర చాటింపు పొంగళ్ల ఊరేగింపు

- 60 వసంతాల అనంతరం ఘనంగా ఉత్సవం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరులోని గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. పోలేరమ్మకు విశేషాలంకరణ చేసి, జాతర చాటింపు కార్యక్రమం ఘనంగా జరిపారు. మహిళలు అంబళ్లతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం దేవాలయంలోని విగ్రహాలను పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. పోలేరమ్మ ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించగా, భక్తులు ఎదురు పొంగళ్లు పెట్టారు.

నాగలాపురంలో దున్నపోతు ఊరేగింపు

నాగలాపురం: మండల కేంద్రంలో ఈ నెల 7,8 వ తేదీల్లో పోలేరమ్మ జాతర వైభవంగా జరుగనుంది. ఈ నేపథ్యంలో నాగలాపురం వెస్టులో ఉన్న పోలేరమ్మ ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. 7వ తేదీ రాత్రి పోలేరమ్మ ఊరేగింపు అనంతరం 8వ తేదీ ఉదయం అమ్మవారికి దున్నపోతును బలి ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం సంప్రదాయం ప్రకారం దున్నపోతుకు ఆలయ అర్చకుడు జానకిరామన్ ప్రత్యేక పూజలు చేసి, పురవీధుల్లో ఊరేగించారు.


బుచ్చినాయుడుకండ్రిక: అంబలి ఊరేగింపులో మహిళలు,


నాగలాపురం: వీధుల్లో విద్యుత్ అలంకరణ

జాతరకు చాటింపు

నారాయణవనం: మండలకేంద్రంతోపాటు మరో మూడు గ్రామాల్లో ఏడు గంగమ్మల జాతరకు మంగళవారం రాత్రి చాటింపు వేశారు. నారాయణవనంలో మూడు ప్రాంతాల్లో, వీకే పాళెం, నాగిలేరు, బొప్పరాజుపాళెం, సముదాయం గ్రామాల్లో ఈ నెల 14వ తేదీ బుధవారం జాతరను నిర్వహించనున్నారు. నారాయణవనంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో జరిగే జాతరకు మంగళవారం మధ్యాహ్నం పొంగళ్లు పెట్టారు. రాత్రి చాటింపు వేశారు. జాతరలో భాగంగా ఈనెల 13వ తేదీ మంగళవారం రాత్రి ఏడు గంగమ్మలు గ్రామాల వీధుల్లో ఊరేగింపుగా బయలుదేరి, బుధవారం వేకువ జామున నిర్దేశిత ప్రదేశాల్లో కొలువుదీరుతారు. అదే రాత్రి నిమజ్జనం చేస్తున్నట్లు జాత్తర కమిటీ తెలిపింది.